క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

మెట్‌పల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు హెచ్‌పీసీఎల్ ఉపకార వేతనాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకయ్య గురువారం తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం ఫలితాల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఉపకార వేతనాలను మంజూరు చేస్తారన్నారు. ఈనెల 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

రాయికల్: అల్లీపూర్ గ్రామంలో ఈనెల 23 నుంచి ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సుతారి తిరుపతిరెడ్డి గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు వేల్పుల ప్రవీణ్ 8106160279, లోకిని రాజేందర్ 9676807040 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు మహారుద్ర హోమం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పంచాయతీ కార్యాలయం ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం మహారుద్ర హోమం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురువారం సభ్యులు తెలిపారు. ఉదయం 7 గంటలకు నామస్మరణ, ధ్యానం, 8 గంటలకు గణపతి పూజ, రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, 10 గంటలకు రుద్ర హోమం, లలిత సహస్ర నామ పారాయణ మూలమంత్ర హవనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 27 గుండాలతో 108 మంది దంపతులతో హోమం చేపడుతున్నట్లు, పాల్గొనే జంటలు సభ్యులను సంప్రదించాలన్నారు.

క్షేత్రస్థాయి పర్యవేక్షణలో బల్దియా కమిషనర్

జగిత్యాలటౌన్: జగిత్యాల బల్దియా కమిషనర్ చిరంజీవి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. గతంలో ఇళ్ల నిర్మాణ అనుమతులు టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రమే చూడగా.. ప్రస్తుతం కమిషనర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ శానిటేషన్ పనులు, చెత్త సేకరణపై దృష్టి సారిస్తున్నారు.

కేవైసీ చేసుకోవాలంటూ ఫేక్ మెసేజ్‌లు

మల్యాల: యోనో కేవైసీ నమోదు చేసుకోవాలంటూ ఎస్‌బీఐ టీం పేరిట మండలంలోని పలువురికి వాట్సాప్ గ్రూపుల్లో మెసేజీలు రావడం కలకలం రేపింది. ముత్యంపేటకు చెందిన ఓ యువకుడి పేరిట ఎస్‌బీఐ యోనో ఖాతాకు కేవైసీ చేసుకోవాలని, పాత పాన్‌కార్డు అనుసంధానం చేయడంతో క్లోజ్ అవుతుందని మెసేజ్ రావడంతో పలువురు ఆందోళన చెందారు. పాన్‌కార్డు వివరాలు యోనో యాప్‌లో అప్‌లోడ్ చేశామంటూ డాక్యుమెంట్ ఫైల్ వచ్చింది. అయితే ఇది ఫేక్ మెసేజ్ అని కొంతమంది గ్రూపుల్లో పోస్టు చేశారు. బ్యాంకు పేరిట మెసేజ్ రావడంపై బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. తాము ఎటువంటి మెసేజీలు పంపలేదని స్పష్టం చేసినట్లు బాధితులు తెలిపారు.

కొత్తగా రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు

కథలాపూర్: మండలంలో 19 గ్రామాలకు ఏడు విద్యుత్ సబ్ స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో ఓవర్ లోడ్ సమస్య ఏర్పడుతోంది. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం సిరికొండ, పోసానిపేటలో రెండు సబ్ స్టేషన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పోసానిపేటలో స్థల సేకరణ పూర్తయ్యిందని, త్వరలో టెండర్ నిర్వహిస్తామని, సిరికొండలో స్థలాన్ని గుర్తించాల్సి ఉందని ట్రాన్స్‌కో ఏడీఈ రఘుపతి తెలిపారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి

మల్లాపూర్: గంగపుత్రులను ఎస్టీ జాబితాలో చేర్చాలని గంగపుత్ర సంఘం జిల్లా నాయకుడు రొద్ద రాజు అన్నారు. గురువారం వేంపల్లిలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవంలో పాల్గొన్నారు. గ్రామ శివారులో చెరువు వద్ద చేపలు పట్టే పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. గంగారాం, లక్ష్మీనారాయణ, గంగరాజం, రిశ్వంత్, గంగాధర్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనం నిర్మించండి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం ఇందిరానగర్ గ్రామవాసులు ఎమ్మెల్యేను కలిశారు. నర్సింహులపల్లె గ్రామం నుంచి ఇందిరానగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారని, గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని కోరారు. స్థల సేకరణ చేస్తే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. డాక్టర్ పూడూరు ప్రభాకర్, నారపాక సుదర్శన్, పూడూరు రమేశ్, నారపాక రమేశ్, శేఖర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

జగిత్యాల: టీయూఎఫ్, కేజీబీవీ, యూఆర్‌ఎస్ వింగ్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా గుంటుక సురేశ్, వాసం సునీత ఎన్నికయ్యారు. హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా నుంచి వీరిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పరామర్శ

జగిత్యాలరూరల్: బేతి తిరుపతిరెడ్డికి చెందిన ఎలక్ట్రిక్ వాహనం పేలి మంటలు చెలరేగి ఇంటి డోర్లు కాలిపోగా.. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత కుటుంబాన్ని పరామర్శించారు. అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఆనందరావు, గంగారెడ్డి, రవి, ప్రమోద్ పాల్గొన్నారు.

కానరాని సమయపాలన

- మెట్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో ఉద్యోగుల ఇష్టారాజ్యం
- ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కాని వైనం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. విధుల నిర్వహణ విషయంలో సమయపాలనను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. విధులకు ఆలస్యంగా హాజరు కావడమే కాకుండా.. పని వేళలకు ముందుగానే ఇంటికి వెళ్లి పోతున్నారు. ఇలా ఎన్నో రోజుల నుంచి ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

కార్యాలయం ఖాళీ..

మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ఐకేపీ కార్యాలయాన్ని గురువారం ఉదయం 11 గంటలకు సాక్షి విజిట్ చేసింది. ఆ సమయానికి ఉద్యోగులు ఒక్కరు కూడా కార్యాలయంలో లేరు. కుర్చీలన్నీ ఖాళీగానే కనిపించాయి. ఒక తాత్కాలిక అటెండర్ మాత్రమే ఉంది. కార్యాలయానికి ఎవరు రాలేదా అని అటెండర్‌ను సాక్షి అడగగా.. ఎవరు రాలేదని బదులిచ్చింది. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకే కార్యాలయంలో హాజరు కావాల్సి ఉండగా.. ఒక్కరు కూడా రాలేదు.

కుర్చీలు వెలవెల..

ఐకేపీలో ఏపీఎం, ఐదుగురు సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్ విధులు నిర్వహిస్తున్నారు.



ఉద్యోగులు, సిబ్బంది లేకపోవడంతో వెలవెలబోతున్న కుర్చీలు



ఖాళీగా ఏపీఎం కుర్చీ

ఉన్న కొద్ది మందిలో ఏ ఒక్కరు కూడా సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్న ఆరోపణలున్నాయి. కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు తిరిగి వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఫలితంగా కుర్చీలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. పలువురు ఫీల్డ్ పేరిట విధులకు డుమ్మా కొడుతున్నారు. వీరిని అడిగేవారు లేరని, అడ్డుకునేవారు అసలే లేరన్న ధీమాతో కార్యాలయానికి వెళ్లకుండా.. తమకు వీలున్న సమయంలోనే విధులు నిర్వర్తిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పొంతన లేని సమాధానాలు

ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడంపై ఏపీఎం విమోచనను సాక్షి వివరణ అడగగా.. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పడం ఐకేపీ ఉద్యోగుల విధుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఏ ఒక్కరు కూడా కార్యాలయంలో లేరని చెబితే.. కొందరు ఫీల్డ్‌కు వెళ్లారని తెలిపారు. ఫీల్డ్‌కు వెళ్లినట్లు తమ శాఖకు సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో ఉద్యోగులు ఫొటోలు వేశారా అంటే.. వేయలేదని, అప్పుడప్పుడు మాత్రమే వేస్తారని సమాధానమిచ్చారు. ఒకరు బ్యాంకుకు వెళ్లారని, మరొకరు కార్యాలయానికి వచ్చి బయటికెళ్లారని తెలిపారు. అక్కడున్న తాత్కాలిక అటెండర్ మాత్రం ఏ ఒక్కరూ రాలేదని చెప్పడం గమనార్హం.



కథలాపూర్: దూలూర్ గ్రామం నుంచి బొమ్మెన గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. తారు రోడ్డు వర్షంతో కోతకు గురై గుంతలుగా మారిందన్నారు. రోడ్డు పక్కన పెరిగిన తుమ్మ చెట్లు రోడ్డుపైకి వాలడంతో వాహనాలపై వెళ్లేవారికి ప్రమాదకరంగా మారాయని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్, రోడ్ల భవనాల శాఖ ఏఈ, కథలాపూర్ క్లస్టర్, సెల్ నం.: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

తప్పులు లేకుండా నమోదు చేయాలి

మల్యాల: మండలంలో చేపట్టిన ఇంటింటి సామాజిక, రాజకీయ, ఉపాధి, కుల గణన సర్వే వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో స్వాతి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఎంపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

మండలంలో సర్వే 99 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో 17,061 ఇళ్లుండగా.. 106 మంది ఎన్యుమరేటర్లతో సర్వే చేపట్టి 99 శాతం పూర్తి చేశామన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామాల సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. 93.24 శాతం సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

కథలాపూర్: మండలంలో సర్వే ప్రక్రియ పూర్తి కాగా.. కంప్యూటర్‌లో నమోదు చేసే కార్యక్రమం గురువారం ప్రారంభించారు. మండలంలో 15వేల కుటుంబాల సర్వే చేపట్టారు. ఎంపీడీవో శంకర్ గ్రామాల్లో పర్యటించారు.



అవగాహన కల్పిస్తున్న మల్యాల ఎంపీడీవో స్వాతి

పెగడపల్లి: మండలంలో సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఆన్‌లైన్ నమోదు తీరును ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ పరిశీలించారు.

బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తెద్దాం

సారంగాపూర్: బీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ఐక్యంగా శ్రమిద్దామని జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం బీర్‌పూర్ మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, బీఆర్‌ఎస్ బీర్‌పూర్ మండల అధ్యక్షుడు సుమన్‌గౌడ్, నాయకులు ఉయ్యాల కిషన్, సుదర్శన్, వెంకటేశ్ పాల్గొన్నారు. బీర్‌పూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గడ్డమీది రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా శనిగారపు సుదర్శన్, ఉపాధ్యక్షులుగా చిగురు రాములు, ఏనుగంటి జతేందర్‌గౌడ్, చిర్నేని రవి, ప్రచార కార్యదర్శిగా చెట్‌పల్లి సత్యనారాయణ, ముఖ్య సలహాదారుడిగా చల్ల లక్ష్మణ్ ఎన్నికయ్యారు.



బీర్‌పూర్‌లో మాట్లాడుతున్న వసంత

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: మండలంలో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ రమణారెడ్డి కోరారు. గురువారం వర్షకొండ, తిమ్మాపూర్ గ్రామాల్లో ఈజీఎస్ నిధులు రూ.20లక్షల చొప్పున నిర్మిస్తున్న హెల్త్ సబ్ సెంటర్ భవనాలను పరిశీలించారు. పంచాయతీరాజ్ ఏఈ అరుణ పాల్గొన్నారు.



వర్షకొండలో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణం పరిశీలిస్తున్న డీఈ రమణారెడ్డి

ఆరోగ్యమే మహాభాగ్యం

జగిత్యాల: ప్రస్తుత కాలంలో ఆరోగ్యం కాపాడుకోవడమే గొప్ప అని ఇంటర్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించగా.. ఆయన హాజరయ్యారు. ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి, రిజ్వానా, సుమేర సుల్తాన పాల్గొన్నారు.



వంటకాలు రుచి చూస్తున్న నోడల్ అధికారి

అక్రమ నిర్మాణం తొలగించాలి

కోరుట్ల: పట్టణ శివారులోని 63వ నంబరు జాతీయ రహదారి పక్కన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని 31వ వార్డు కౌన్సిలర్ పెండెం గణేశ్ కమిషనర్ బట్టు తిరుపతికి గురువారం వినతిపత్రం సమర్పించారు. 1,363 సర్వే నంబర్‌లో జాతీయ రహదారికి 100 ఫీట్లు వదిలి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. కేవలం 45 ఫీట్లు మాత్రమే వదిలిపెట్టి రియాల్టర్లు అక్రమ నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ గణేశ్

సంక్షిప్త వార్తలు

● సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని గురువారం డీఈవో జగన్మోహన్‌రెడ్డికి టీపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన పరీక్షల మూల్యాంకన రెమ్యునరేషన్ ఇంతవరకు రాలేదన్నారు. ట్రెజరీ అధికారికి సైతం వినతిపత్రం అందజేశారు. కొక్కుల రాంచంద్రం, ఎడ్ల గోవర్ధన్, రఘుపతి, బోగ రమేశ్ పాల్గొన్నారు.

● ఇసుక వేలం

ఇబ్రహీంపట్నం: కొమటికొండాపూర్‌లో ఇటీవల సుమారు 40 ట్రిప్పుల ఇసుక డంపును రెవెన్యూ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. గురువారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా.. కొమటికొండాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీనర్సయ్య అనే వ్యక్తి రూ.51వేలకు పాడి ఇసుకను దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ రెవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పీసీసీ చీఫ్‌ను కలిసిన మహిళా అధ్యక్షురాలు

జగిత్యాల: హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు. జిల్లాలోని సమస్యలు, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల అంశాలపై పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు వివరించారు.

● ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు

మల్లాపూర్: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో గురువారం ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజీలు ఆర్థికంగా వెనకబాటుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముదిరాజ్ మహాసభ జెండా ఎగరేశారు. చిట్యాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

● ఇన్‌స్పెక్టర్లమంటూ కాల్ వస్తే నమ్మొద్దు

రాయికల్: పట్టణంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ ఫోన్ కాల్స్ వస్తే నమ్మొద్దని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు లైసెన్స్ రెన్యువల్ పేరిట ఫోన్లు చేస్తే ఎవరూ స్పందించొద్దన్నారు. 1930 సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

● నేత్ర వైద్యశిబిరానికి స్పందన

రాయికల్: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన లభించింది. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో కరీంనగర్ రేకుర్తి వైద్యుడు ప్రభాకర్ 134 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 44 మందిని ఆపరేషన్ల కోసం గుర్తించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సభ్యులు ఎద్దండి దివాకర్, బోడుగం అంజిరెడ్డి, శ్రీనివాస్, బెక్కం తిరుపతి పాల్గొన్నారు.

● పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

రాయికల్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించొచ్చని డాక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. రాయికల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, ఉపాధ్యాయులు పొన్నం రమేశ్, రవీందర్, గంగజమున, సత్యనారాయణ, తిరుమల, గంగాధర్, వనిత, శివానందం, పారిపల్లి గంగాధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ఆన్‌లైన్ చేయాలి

సారంగాపూర్: వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వాటి వివరాలను ట్యాబ్‌లో ఆన్‌లైన్ చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) బీఎస్ లత అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం వచ్చిన వెంటనే తూకం వేసి, ట్యాబ్‌లో నమోదు చేసి మిల్లులకు తరలించాలన్నారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ జమీర్, డిప్యూటీ తహసీల్దార్ లాస్య, ఆర్ఐ భాస్కర్‌రావు, సీఈవో లైశెట్టి శివ ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలి



మూలరాంపూర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న ఏడీఏ రమేశ్

ఇబ్రహీంపట్నం: రైతులు పండించిన సన్న రకం వరి ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఏడీఏ రమేశ్ సూచించారు. గురువారం మూలరాంపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో సన్న రకం వరి ధాన్యాన్ని మిషన్‌లో పరిశీలించారు. ఇబ్రహీంపట్నం, యామపూర్, తిమ్మాపూర్, డబ్బా గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏవో రాజ్‌కుమార్, ఏఈవో రవళిక, వినోద్, రైతులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు



వరి కొయ్యలు కాల్చొద్దంటూ రైతులకు నచ్చజెబుతున్న వినీల

జగిత్యాలఅగ్రికల్చర్: పంట పూర్తయిన తర్వాత పంట అవశేషాలు కాల్చొద్దని జగిత్యాల అర్బన్ మండల వ్యవసాయాధికారిణి వినీల అన్నారు. ధరూర్ గ్రామంలో రైతులకు గురవారం అవగాహన సదస్సు నిర్వహించడంతోపాటు పంట అవశేషాలను కాల్చుతున్న రైతుల వద్దకు వెళ్లి నష్టాలను వివరించారు. ఏఈవో నాగరాజు, రైతులు సదాశివరావు, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ

జగిత్యాల: విద్యార్థులు పుస్తక పఠనం ప్రతిరోజు చేయాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. గురువారం కళాశాలలో వృక్షశాస్త్ర విభాగాధిపతి పడాల తిరుపతి రచించిన ఎన్‌వోవర్ వ్యూ టు ద ఫీల్డ్ ఆఫ్ ప్లాంట్ టిష్యూ కల్చర్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. చంద్రయ్య, సుజాత, నరేశ్, రహీం, ప్రమోద్‌కుమార్, వాసాల ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన చల్ల గంగన్న ఇల్లు విద్యుదాఘాతంతో రెండు రోజుల క్రితం కాలిపోగా.. గురువారం జగిత్యాల సత్యసాయి అభయహస్తం వారు బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. గంగన్న కుటుంబానికి నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట సామగ్రి, రూ.6500 నగదు మొత్తం రూ.25వేల విలువ చేసే సామగ్రి, వస్తువులు అందజేసారు. గంగన్న కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి పరామర్శించారు.

జగిత్యాలలో బలగం సత్తన్న సందడి

జగిత్యాలటౌన్: బలగం చిత్రం నటుడు సత్తన్న గురువారం జగిత్యాలలో సందడి చేశారు. జగిత్యాలకు చెందిన ప్రముఖ దర్శకుడు, నటుడు రాజీనరేంద్ర స్వీయ దర్శకత్వంలో పర్యావరణ కథాంశంగా నిర్మిస్తున్న చిత్రంలో బలగం ఫేం సత్తన్న ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు గురువారం సత్తన్న జగిత్యాలకు రాగా.. జగిత్యాలకు చెందిన మూవీ టెక్నీషియన్లు, కళాకారులు సత్తన్నను కలిసి సెల్ఫీలు దిగేందుకు పోటీ పడటంతో సందడి నెలకొంది. కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్స్ అధినేత గుండేటి రాజు సత్తన్న, దర్శకుడు రాజీనరేంద్రను శాలువా, మెమొంటోతో సత్కరించారు. నటుడు, న్యాయవాది బూసారపు శ్రీనివాస్‌గౌడ్, మూవీ ఫొటోగ్రాఫర్ హరీశ్‌పటేల్, రచయిత అల్లె మధు, నిర్మాతలు మల్లికార్జున్, విష్ణువర్ధన్ తదితరులున్నారు.



బలగం సత్తన్నతో స్థానిక కళాకారులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పెగడపల్లి విద్యార్థి

పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న రాచకొండ రాహుల్ పాఠశాలల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ రమేశ్ గురువారం తెలిపారు.



రాహుల్

గత నెల వల్లంపల్లిలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో జగిత్యాల జిల్లా తరఫున అండర్–14 విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, ఈనెల 23, 24, 25ల్లో హైదరాబాద్‌లోని దోమలగూడలో నిర్వహించే పోటీల్లో రాహుల్ పాల్గొననున్నట్లు చెప్పారు. పాఠశాల ఆవరణలో ఎంఈవో సులోచనాదేవి, హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

జగిత్యాల: మెట్‌పల్లిలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జగిత్యాల ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్‌లో చదువుతున్న మోక్షిత్ 100 మీటర్ల పరుగు పందెం 16.01 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానం సాధించాడు. ప్రధానోపాధ్యాయుడు రామానుజం, ఉపాధ్యాయులు బోనగిరి దేవయ్య, జయశ్రీ అభినందించారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జిల్లాలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మ్యూజికల్ చైర్, డ్రాయింగ్, స్పీచ్, మెహందీ, రంగోలి పోటీల్లో బహుమతులు పొందారు. డైరెక్టర్ హరిచరణ్‌రావు అభినందించారు.

రాయికల్: మెట్‌పల్లి మినీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో రాయికల్ విజ్‌డమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 50 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో బొమ్మెన లోకేశ్వర్ స్వర్ణం, రజత పతకాలు సాధించగా.. 50, 300 మీటర్ల పరుగు పందెంలో గడ్డం తన్మయ క్యాంసం పతకాలు సాధించారు. చౌడారపు దేవాన్షి, పెద్దిరెడ్డి హర్షిత్‌రెడ్డి 50 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మాజీ ఎంపీపీ నిరసన

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయం గేట్ వద్ద సిరికొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నాంపెల్లి లింబాద్రి గురువారం బైఠాయించి నిరసన దీక్ష చేపట్టారు. సిరికొండ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సొంత భవనంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను నిర్వహించాల్సి ఉండగా.. నిర్వాహకుడు తన సొంత ఇంట్లో నిర్వహిస్తున్నారన్నారు. స్థానిక అధికారులనడిగితే దాటవేసే ధోరణిలో వ్యవహరించారని ఆరోపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్ష చేపట్టారు. లింబాద్రికి పలువురు నాయకులు సంఘీభావం ప్రకటించారు.



నిరసన దీక్షలో కూర్చున్న లింబాద్రి

నిప్పంటుకొని బాలుడికి గాయాలు

మల్యాల: మండల కేంద్రంలో ముగ్గురు బాలుర మధ్య జరిగిన వివాదంలో ఓ బాలుడి కాళ్లకు పెట్రోల్ మంటలంటుకొని గాయపడ్డాడు. ఇద్దరు ఏడోతరగతి విద్యార్థులు, ఓ పదోతరగతి విద్యార్థి మధ్య చిన్న వివాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో అక్కడే ఉన్న పెట్రోల్ డబ్బాకు నిప్పంటించారు. సమీపంలోనే కారు ఉండడంతో డబ్బాను కాలితో దూరంగా తన్నే క్రమంలో మంటలంటుకొని ఒకరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లిదండ్రులు పోలీసుల వద్దకు వెళ్లి రాజీ కుదుర్చుకుంటామని చెప్పినట్లు సమాచారం.

హెల్త్ సబ్ సెంటర్‌కు భూవిరాళం

మెట్‌పల్లిరూరల్: వేంపేట గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి భూమిచ్చి ఉదారత చాటుకున్నారు ఇద్దరు వ్యక్తులు. హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి రెండేళ్ల క్రితమే నిధులు మంజూరైనా.. స్థల సమస్యతో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఈ విషయం తెలుసుకున్న మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి స్థలం కోసం అన్వేషించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మారంపెల్లి శ్రీనివాస్, గుంలాపూర్ మాజీ ఎంపీటీసీ వెంకటేశ్‌కు ఓ చోట భూమి కలిపి ఉన్నట్లు తెలుసుకున్న ఆయన.. కొంత భూమిని హెల్త్ సబ్ సెంటర్‌కు ఇవ్వాలని చర్చించారు. దీంతో మూడు గుంటల భూమిని ఇస్తున్నట్లు అంగీకరించిన భూయజమానులిద్దరూ.. భూమి అప్పగింతకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేశారు. శ్రీనివాస్, వెంకటేశ్‌ను గ్రామస్తులు అభినందించారు. గురువారం హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు అధికారులు మార్కింగ్ ఇచ్చి భూమిపూజ నిర్వహించారు. మండల ప్రత్యేకధికారి సత్యనారాయణ, వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ అన్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్, మాజీ ఎంపీటీసీలు వెంకటేశ్, శేఖర్, కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.